ప్రజాశక్తి

శనివారం 24 ఆగస్టు 2024 5 శ్రీ సత్యసాయి

మున్సిపల్ కమిషనర్‌ను విచారిస్తున్న అధికారులు

పుట్టపర్తిలో మళ్లీ విజిలెన్స్ సోదాలు

◆ మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు ◆ పలు రికార్డులు స్వాధీనం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో మళ్లీ విజిలెన్స్ సోదాలు జరిగాయి. గత పది రోజుల క్రితం ఇదే కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. దానికి కొనసాగింపుగా శుక్రవారం నాడు 2వ సారి సోదాలు చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపారు. నకిలీ బిల్లులతో కోట్ల రూపాయల స్వాహా చేసినట్లు ఫిర్యాదుతో తనిఖీలు నిర్వహించారు. ఇందులో కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పుట్టపర్తి మున్సిపాల్టీలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, అప్పటి కమిషనర్ కుమ్మక్కై పెద్ద ఎత్తున ప్రభుత్వ నిధులు కొల్లగొట్టారంటూ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఏఈ రాజశేఖర్ నేతత్వంలో విజిలెన్స్ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు కీలక రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు సచివాలయాల్లో కూడా తనిఖీలు చేపట్టారు. చెత్త తరలింపు వాహనాల మరమ్మతులు, డీజిల్ కొనుగోలు తదితర వాటిలో నకిలీ బిల్లులు సష్టించి పెద్ద ఎత్తున నిధులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో చెత్తబుట్టలు పంపిణీ చేయకుండానే రూ.30 లక్షల నిధులు కాజేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. సత్యసాయి జయంతి వేడుకల పేరిట నిధులు ఖర్చు చేయకుండానే పెద్ద ఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబులపతి కొంతమంది కౌన్సిలర్లు, అధికారులు కుమ్మక్కై నిధులు కొల్లగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. వీటితోపాటు వసూలు చేసిన ఇంటి, కొళాయి, చెత్త పన్నులను నిధులను స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు సంబంధించి అన్ని వివరాలనూ విజిలెన్స్ అధికారులు గుర్తించి రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మున్సిపాల్టీలో వరుసగా జరుగుతున్న విజిలెన్స్ అధికారుల తనిఖీలతో అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అవినీతిపై సమగ్ర విచారణ నిర్వహించి ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు సైతం కోరుతున్నారు

లేపాక్షిలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పల్లె ప్రగతికి గ్రామసభ

◆ జిల్లా వ్యాప్తంగా కొనసాగిన గ్రామసభలు

◆ గ్రామస్తుల సమక్షంలో పనుల ఎంపిక

పల్లె ప్రగతి కోసం గ్రామసభల నిర్వహణ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలు శుక్రవారం నాడు జిల్లాలోని అన్ని గ్రామాల్లో కొనసాగాయి. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమాల్లో జిల్లా, మండల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల సమక్షంలో గ్రామసభలను నిర్వహించి ఉపాధి పనుల ఎంపిక, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై బహిరంగంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు గ్రామాభివృద్ధి కోసం చేసిన సూచనలను అధికారులు వినతిపత్రాల రూపంలో స్వీకరించారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం : కలెక్టర్

లేపాక్షి : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం నాడు నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక కార్యాచరణను ప్రభుత్వం రూపొందించిందన్నారు. మరుగుదొడ్లు, విద్యుత్, కుళాయి, వంటగ్యాస్ కనెక్షన్ల మంజూరు, మురుగునీరు-ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, సిమెంటు రహదారులు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మండల కేంద్రాలకు లింక్ రోడ్లు ఇంకుడు గుంతలు, పంటకుంటల నిర్మాణం. ఉద్యానవన, పట్టు పరిశ్రమ అభివద్ధికి సదుపాయాలు, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణానికి సహకారం తదితర వాటిపై గ్రామసభల్లో చర్చించి గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రజలు చెయిచెయి కలిపి గ్రామాభివద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. లేపాక్షి సంతలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పనులు, గొంగేటి పల్లిలో అంగనవాడి భవన నిర్మాణం తదితర వాటిపై గ్రామసభలో గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, ఎంపీడీవో నరసింహనాయుడు, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, టీడీపీ కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, మాజీ సర్పంచి వెచ్చం రవితో పాటు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వేమన సాహితీ యాత్ర

పెనుకొండ : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ కదిరి నియోజకవర్గం లోని కటారుపల్లి, తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతాల్లో జాబిలి చాంద్ బాషా అధ్యక్షతన వేమన సాహితీ యాత్ర ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది కవులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చదువులు బాబు, ప్రొఫెసర్ జి.బాలసుబ్రమణ్యం, ఎస్కేయు తెలుగు భాష శాఖ అధ్యక్షులు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు రజిత హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని రాయసం చిన్నారావు, బాబాఫకృద్దీన్, ఉపేంద్రం శంకర నారాయణరాజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఉమర్ ఫారూక్ ఖాన్, కోనాపురం ఈశ్వరయ్య, డా.శివన్న, భాస్కర్ నాయుడు, ఆశ్రయ క్రిష్ణారెడ్డి, ఎంఆర్ హనుమంతు తదితరులు హాజరవుతారని తెలిపారు. వేమన సాహితీ యాత్ర కదిరి నుంచి ప్రారంభమై కటారుపల్లిలో వేమన సమాధి వద్దకు చేరుకుంటుందన్నారు. అక్కడ 25 మందితో వేమన సాహితీ వేదిక తరపున కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. అనంతరం తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతం చేరుకొని పుట్టపర్తి నారాయణచార్యుల రెండవ వేదిక కొనసాగుతుందన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

రొద్దం : మండలంలోని రాగిమేకలపల్లి గ్రామంలో శుక్రవారం లావణ్య అధ్యక్షతన సుశీలమ్మ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంతశక్తి సీఈవో లావణ్య, మహాశక్తి సీఈవో రమీజా, పావని, రవళి, మహాశక్తి సిబ్బంది పాల్గొన్నారు. వారు బాల్య వివాహాలు, గృహహింసపై ప్రసంగించారు. అనంతశక్తి సిబ్బంది నాటిక రూపంలో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ సలహా కేంద్రం కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అవినీతి కనపడలేదా : టిడిపి

మడకశిర : నియోజకవర్గంలో గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే పలమనేరు తిప్పేస్వామి చేసిన అవినీతి మీకు కనపడలేదా అని టిడిపి నాయకులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని ప్రశ్నించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే ఎమ్మెల్యే రాజు చేస్తున్న అభివృద్ధి ని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. వైసిపి హయాంలో మాజీ ఎమ్మెల్యే చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించి తమ వద్ద ఆధారాలతో సహా ఉన్నాయని వాటిపై మీకు ప్రశ్నించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండలాల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ రాజా, నాయకులు భక్తర్‌సాబ్, శివాజీ, కృష్ణమూర్తి, నాగరాజు, రవి, పుల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

అమరాపురం : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనను ఖండిస్తూ శుక్రవారం అమరాపురంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణప్ప, చెన్నప్ప, దేవరాజు, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టిన నాయకులు

పదునైనా లేని ప్రత్యామ్నాయ విత్తనం..!

◆ ఇప్పటికీ ఖరారవని ధరలు ◆ మొదలవని సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్‌లో కీలకమైన జులై నెలలో వర్షాలు పడలేదు. దీంతో ప్రధాన పంటల సాగు అనుకున్నంత జరగలేదు. అదును దాటక ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో పంట విత్తుకునేందుకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో లేవు. ప్రణాళికలైతే జులై నెలాఖరులనే చేసినప్పటికీ విత్తనం ధర నిర్ణయించకపోవడం, సేకరణ ప్రారంభమవకపోవడంతో విత్తన పంపిణీ జరగలేదు. ఒకవైపు వర్షాలు విస్తారంగా పడుతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైనా సాగు చేసుకుందామంటే వీల్లేకుండా ఉంది. ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో లేవు.

5.54 లక్షల ఎకరాలు బీడు

అనంతపురం జిల్లాలో 8.56 లక్షల ఎకరాలున్నాయి. సాధారణ పంటల సాగవుతుందని అంచనా వేస్తే జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. 3.02 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. తక్కిన సాగుభూమి అంతా బీడుగా ఉంది. 5.54 లక్షల ఎకరాల్లో విత్తనం పడలేదు. ఆగస్టు రెండవ వారం నుంచి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీనికి తగ్గట్టు వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించింది. 27,907 క్వింటాళ్లు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఉలవలు 21,791 క్వింటాళ్లు, పెసలు 1501 క్వింటాళ్లు, అలసంద 3253 క్వింటాళ్లు, జొన్నలు 973 క్వింటాళ్లు, కొర్ర 369 క్వింటాళ్లు, మినుములు 90 క్వింటాళ్లు మొత్తం 27907 క్వింటాళ్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికీ విత్తన ధర నిర్ణయం జరగలేదు. సేకరణ టెండరు ప్రక్రియ వరకే పూర్తయింది. ఇంకా టెండరు ఫైనల్ అయి సేకరణ ప్రారంభమై, పంపిణీకి మరింత సమయం పడుతుంది. అంతలోపు నేలలో తేమ ఆరిపోతే విత్తుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతాయి. మంచి వర్షాలు పడిన సమయంలో విత్తనం పంపిణీ జరిగుంటే బాగుండేదని రైతులు వాపోతున్నారు.

ఆగస్టులో విస్తారంగా వర్షాలు

ఆగస్టులో వర్షాలు విస్తారంగా పడ్డాయి. సాధారణ వర్షపాతం 57.6 మిల్లిమీటర్ల కురవాల్సి ఉండగా 199.7 మిల్లీమీటర్లు పడింది. అంటే సాధారణం కంటే 246 శాతం అధికంగా పడింది. అదే జులై నెలలో చూసినప్పుడు 63.9 మిల్లి మీటర్లకుగానూ 24.4మిల్లీ మీటర్లు పడింది. సాధారణం కంటే 61.8 శాతం లోటుపడింది. అంతకు మునుపు జూన్ నెలలో 61 మిల్లీమీటర్లకుగానూ 147.7 మిల్లీమీటర్లు పడింది. మొత్తంగా చూసినప్పుడు సాధారణం కంటే ఎక్కువే పడినప్పటికీ కీలకమైన జులై నెలలో వర్షాభావంతో పంటల సాగుపై ప్రభావం చూపింది.

పనితీరుకు ప్రాధాన్యత ఏది..?

ప్రజాశక్తి-కదిరి టౌన్

జిల్లా ఐసిడిఎస్ పరిధిలో ఎన్నో సంవత్సరాలు నుంచి అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు కరువు అయ్యిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి ప్రజల నుంచి మన్ననలు పొందినా, ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు లభించలేదు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి సవితమ్మ, కలెక్టర్ చేతన్ చేతులమీదుగా అవార్డులను అందించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో స్త్రీ శిశుసంక్షేమ శాఖకు సంబంధించి ఉన్నతాధికారి ఆధ్వర్యంలో ప్రాజెక్టుల వారీగా అధికారులు, సిడిపిఒలు, సూపర్‌వైజర్ల పనితీరును గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికలో సదరు ఉన్నతాధికారి సిబ్బంది పనితీరును గుర్తించకుండా వ్యక్తిగత అభిమానంతో అవార్డులకు ఎంపిక

ఉత్తమ అధికారుల గుర్తింపులో పక్షపాతం

చేశారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం ఒక ప్రాజెక్టులో సూపర్‌వైజర్, మరో ప్రాజెక్టుకు ఇన్‌ఛార్జి సిడిపిఒలను అవార్డులకు ఎంపిక చేశారు. ఇక సూపర్‌వైజర్ల పనితీరు ఆధారంగా కాకుండా ఆ అధికారిణితో మంచిగా ఉన్న వారినే మాత్రమే అవార్డుల పురస్కారానికి ఎంపిక చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అవార్డుల ఎంపిక జరిగినప్పటి నుంచి స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఉన్నతాధికారిపై కింది స్థాయి ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిడిపిఒలుగా ఎన్నో సంవత్సరాలు నుంచి అంకిత భావంతో పనిచేస్తున్న వారిని పట్టించుకోకుండా మొండి చెయ్యి చూపించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి భవిష్యత్తులో అయినా పనితీరు ఆధారంగా నివేదికలు తెప్పించుకుని నిబద్ధతతో పని చేసే అధికారులు, సిబ్బందికి గుర్తింపునిచ్చేలా అవార్డులు ఇవ్వాలని ఆ శాఖలో పని చేసే కొందరు సిబ్బంది కోరుతున్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల రీవెరిఫికేషన్ రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - బత్తలపల్లి

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) పొంది ఇతరులకు విక్రయించిన భూములను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ధర్మవరం ఆర్డీవో శివరామిరెడ్డిలతో కలసి సిసిఎల్ఎ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎన్ ప్రభాకరరెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండలంలోని పోట్లమర్రి గ్రామ సర్వేనెంబర్ 392-2లో ఫ్రీహోల్డ్ భూమిని ఇతరులకు విక్రయించడంతో క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని రెండవ రోజు వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల రీవెరిఫికేషన్ చెక్‌లిస్టులను పరిశీలించా రు. అనంతరం చెక్ లిస్టులో చేయాల్సిన మార్పులు చేర్పులను వివరించారు. రిజిస్టర్ అయిన ఫ్రీహోల్డ్ భూములన్నింటిపైనా త్వర తిగతిన రీవెరిఫికేషన్ చేసి చెక్ లిస్టులను అందజేయాల న్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగి ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రీవెరిఫికేషన్ చేసే సమయంలో ప్రత్యేక ఫారంలో వివరాలన్నిం టినీ సవివరంగా నమోదు చేయాలని వీఆర్వోలకు సూచించి నట్లు తెలిపారు. రీవెరిఫికేషన్ చేయడానికి అనుసరించాల్సిన విధానాన్ని, పలు అంశాలపై సూచనలు సలహాలు అందజేశామ న్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ నటరాజన్, ఎస్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ జోసఫ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న జెసి అభిషేక్‌కుమార్, ఆర్డీవో

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి: డీఎస్పీ

కదిరి టౌన్ : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు దుకాణదారు లు వాహనదారులు సహకరించాలని కదిరి డీఎస్పీ శ్రీలత, పట్టణ సిఐ నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో దుకాణదారులు, ప్రైవేటు కార్యాలయ సిబ్బంది , వివిధ వర్గాల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎస్పీతో పాటు మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ తదితరులు హాజర య్యారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరుపక్కల వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ప్రయివేటు కార్యాలయా లు ఉండడంతో వాహనదారులు రోడ్డుపై వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైందన్నారు. ప్రధాన రహదారులైన జీమాను సర్కిల్ నుండి అంబేద్కర్ సర్కిల్ , అంబేద్కర్ సర్కిల్ నుండి వేమారెడ్డి సర్కిల్, వేమారెడ్డి సర్కిల్ నుండి చౌక్ సర్కిల్, చౌక్ నుండి జీమాను సర్కిల్ (ఇక్బాల్ రోడ్) కోనేరు కూడలి వరకు రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిపి ఉంచడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నా యన్నారు. అదేవిధంగా ఫుట్‌పాత్‌పై వెళ్లేవారికి సమస్యగా ఉందన్నారు. అదే విధంగా ఖాద్రీశుడి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలన్నారు. గత కొంత కాలంగా దొంగతనాల ఎక్కువయ్యాయని నివారణ నిమిత్తము సెక్యూరిటీని ఏర్పాటు చేసుకునే అంశంలో ప్రతి షాప్ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో దుకాణాల యజమానులు, వాణిజ్య సముదాయాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

జన సంరక్షణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా నరసింహులు

సోమందేపల్లి : జన సంరక్షణ సేవా సమితి కర్నూలు రాష్ట్ర కార్యాల యంలో జరిగిన ప్రతినిధుల సమావేశం లో సంస్థ వ్యవస్థాపకులు రజాక్‌వలి శ్రీసత్యసాయి జిల్లా జన సంరక్షణ సేవా సమితి అధ్యక్షులుగా రంగేపల్లి నరసింహులును ప్రకటించినట్లు ఆయన తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రజలు, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా పని చేస్తానని నరసింహులు తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించడంలో కమిషనర్ విఫలం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గిరిజన తండాలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించ కుండా కమిషనర్ ఇబ్బందులు పెడుతున్నాడని రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు రవి నాయక్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 18 వ వార్డు బడే నాయక్ తండాలో 15 రోజుల నుంచి నీరు సరఫరా కావడం లేదన్నారు. మోటార్ల పని చేయకపోవడం వల్ల సమస్య తలెత్తిందన్నారు. కమిషనర్ అంజయ్యకు విన్నవించుకున్న ఆయన పట్టించుకోలేద న్నారు. నీరు సరఫరా నీరు సరఫరా కానందున దాదాపు 300 కుటుంబాలు వ్యవసాయ బోరు బావులను ఆశ్రయిస్తున్నాయన్నారు. గ్రామాల్లో నీటి సమస్య రానీవ్వద్దంటూ ప్రజా ప్రతినిధులు చెబుతున్న కమిషనర్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 26 లోపు నీటి సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముందు గిరిజనులతో కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మదీనా మసీదు నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం జామియా మసీదు ఆధ్వర్యంలో శుక్రవారం మదీనా మసీదు నూతన కమిటిని ఎంపిక చేశారు. ధర్మవరం జామియా మసీదు కమిటీ, మతపెద్దల సమక్షంలో నాగూర్ ఉస్సేన్ ను ముతవల్లిగా ఎంపిక చేయగా ఉప ముతవల్లిగా ఇస్మాయిల్, సెక్రటరీగా నడిం మసీద్ అల్తాఫ్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మెంబర్లుగా చాంద్ బాషా, ససలీం, బాబుల్లా, టైల్స్ అబ్దుల్లా. మహబూబ్ బాషా, సాధిక్, అయూబ్, అజీజ్, బాబుఖాన్, ఖాజా, మదరవలిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ముతవల్లి నాగూర్ ఉస్సేన్ మాట్లాడుతూ ముస్లింల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కూడా తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ మునాఫ్, రహంతుల్లా, అబ్దుల్ సలాం, అస్లాం, పారూక్, రాళ్లపల్లిషరీఫ్, అత్తర్ రహీంబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ టిఎస్.చేతన్

టంగుటూరి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకు న్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదరికంలో జన్మించిన ప్రకాశం వారాల అబ్బాయిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఎన్నో సేవలు అందించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అప్పటి సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా మద్రాసులో ఆంగ్లేయ సైనికులకు ఎదురు నిలబడి రొమ్ము చూపిన ధీరశాలి అన్నారు. ఆయన సీఎం గా ఉన్నప్పుడే తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పడిందన్నారు. ఆయన పాలనలో ఎన్నో విప్లవత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. ఆయన సేవలను గుర్తించి అప్పటి ప్రభుత్వం ఆయన పేరు మీద ప్రకాశం జిల్లా నామకరణం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ భాగ్యరేఖ, బీసీ, ఎస్సీ, సంక్షేమ శాఖ అధికారులు నిర్మల జ్యోతి, శివరంగ ప్రసాద్, సిపిఒ విజయకుమార్, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, క్రీడా శాఖ అధికారి ఉదయ్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, ఎంపీపీ ఎవి.రమణారెడ్డి, సోమిశెట్టి సరళ పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: స్వాతంత్రం ఉద్యమంలో పాల్గొని దేశ ప్రజల కోసం ఎంతో శ్రమించిన యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులని జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న అన్నారు. మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఎన్ విష్ణు , ఎఆర్ డీఎస్పీ జెడ్ విజయ్ కుమార్, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ ఐలు చంద్రశేఖర్, వలి, ఎస్ఐ సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, డిపిఒ, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి : ఎమ్మెల్యే

బుక్కపట్నం : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శిం చారు. సందర్భంగా విద్యార్థినులను పాఠాలు బోధించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. పాఠశాలను ఉత్తీర్ణతలో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలపాలని విద్యార్థినులకు సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. వంటగదికి వెళ్లి మెనూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే సింధూర

కదిరి రూరల్ సిఐగా నాగేంద్ర

కదిరి టౌన్ : కదిరి రూరల్ సిఐగా నాగేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే కందికుంటను కలిసిన నాగేంద్ర

హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

హిందూపురం : పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం సహకారంతో చైతన్య సంస్థ శుక్రవారం హెచ్‌ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్స్, చైతన్య సంస్థ నిర్వాహకులు మాట్లాడుతు విద్యార్థులు హెచ్‌ఐవి పట్ల అవగాహన పెంచుకుని గ్రామల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ జెఎస్‌విఎస్ ప్రసాద్, డాక్టర్. నాగేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, చైతన్య సంస్థ ప్రాజెక్టు మేనేజర్ తిప్పేస్వామి, చైతన్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

గ్రామసభలతో సమగ్రాభివృద్ధి

అర్జీలు స్వీకరిస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

గ్రామసభలో మాట్లాడుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

గ్రామసభలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-మడకశిర

గ్రామసభలతో పంచాయతీల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో శుక్రవారం ఏర్పాటుచేసిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కావున కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలో ప్రతిఒక్కరూ పాల్గొని పంచాయతీ అభివృద్ధికి సలహాలు, సూచనాలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస మూర్తి, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సోనియాబాయి, ఎపిడి లక్ష్మీనారాయణ, గుండుమల క్రిష్టప్ప, సర్పంచి నాగరాజు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో 'ఉపాధి'ని వర్తింపచేయాలి

నగర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎక్కువ మంది నిరుపేద కుటుంబాలకు చెందిన కూలీలు ఉన్నారని కావున ఉపాధి హామీ చట్టాన్ని నగర పంచాయతీలో వర్తింపజేయాలని కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకి వినతిపత్రం సమర్పించారు.

గోరంట్ల : పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన గ్రామసభలో ప్రజలు పలు సమస్యలపై అధికారులకు వినతులు అందజేశారు. సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ వేయాలని చౌడేశ్వరీకాలనీలోని కోళ్ల ఫారం ప్రాంత ప్రజలు కోరారు. ఈకార్యక్రమంలో డిపిఒ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, సర్పంచి సరోజనాగేనాయక్, పంచాయతీ కార్యదర్శి బాబురావు, టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు వేణు జయరాం, ఉమర్‌ఖాన్, శ్రీనివాసులు, అజ్మతుల్లా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మునిమడుగు, గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, దుద్దేబండ, కురుబవాండ్లపల్లి, శెట్టిపల్లి, రాంపురం, మావటూరు, నాగలూరు, అడదాకులపల్లి పంచాయతీల్లో రోడ్లు, పారిశుధ్యం, డ్రెయినేజీ, తదితర పనులకు తీర్మానాలు చేశారు. కొన్ని పంచాయతీల్లో విద్యుత్, మరుగుదొడ్లు, కుళాయిల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. గ్రామసభల్లో ఎంపిడిఒ శివశంకరప్ప, ఎపిఒ జయమ్మ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగళి : మండలంలోని 13 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. జడ్పీటిసి ఉమేశ్ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో పనులు గుర్తించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచి నాగరాజు, మండల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ కుమార్‌స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : కొందరు వంకను ఆక్రమించుకొని గృహ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక షిరిడీనగర్, మధురానగర్ కాలనీవాసులు గ్రామ సభలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ వంక ఉందని, దీని ద్వారా వర్షం నీరు ఆమదాలకుంటకు వెళ్తుందని, 20 ఏళ్ల క్రితం చెక్ డ్యాం కూడా నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ జబివుల్లా షేక్, టౌన్ కార్యదర్శి గంగాధర్ రాయల్, ప్రధాన కార్యదర్శి కాశీం, సంయుక్త కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రొద్దం : మండల వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో అధికారులు, నాయకులు గ్రామ సభలు నిర్వహించగా ప్రజలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ శాతం సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధిలైట్లు, తదితర వాటిపై వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో నారాయణ, రామాంజనేయమ్మ, చిన్న అంజనప్ప, ఫకృద్దీన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని సీసీ గిరి, దేవరహట్టి, గుడిబండ, గుణేమోరుబాగల్, జమ్మలబండ, కిరికెర, కొంకల్లు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఒక్కో ఊరిలో ఒక్కో అధికారి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామసభల్లో ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, ఎపిఒ భార్గవి, తహశీల్దార్ కరుణాకర్, ఈసీ లక్ష్మీనాయక్, ఏవో వీరనరేష్, ఈఓఆర్‌డి నాగరాజనాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కమలమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరి, ఏవో నారాయణప్ప, ఎంఇఒ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : . సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తెలిపారు. గోరంట్ల మండలంలోని పంచాయతీల్లో వారు అధికారులతో కలసి అట్టహాసంగా గ్రామసభలు నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచి సరోజ నాగేనాయక్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో రఘునాథ గుప్తా, డిపిఒ విజయ్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ పులేరు సోమశేఖర్ పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అమరాపురం : మండల వ్యాప్తంగా 11గ్రామ పంచాయితీల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు నిర్వహించారు. అమరాపురంలో ఎంపీడీవో భాస్కర్, సర్పంచి వాగేష్, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, గ్రామ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని రేగాటిపల్లి గ్రామ పంచాయతీ లో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈసదర్భంగా పంచాయతీ కి చెందిన రైతులు ఉపాధి కూలీలు ప్రజలు తమ సమస్యలను అధికారులకు నాయకులకు వివరించారు. గ్రామంలో విద్యుత్, రోడ్డు సమస్య ఉందన్నారు. ముచ్చురామి గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరకుందన్నారు. సీతారాం పల్లివాసులు తాగునీటి సమస్యను వివరించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో నలభై ఆరు రకాల పనులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఇవి రైతులకు, రైతు కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తన సొంత ఖర్చుతో బోరుబావి తవ్విస్తాననిహామీ ఇచ్చారు. ఈ గ్రామ సభలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం, అంగన్వాడీలు, జనసేన నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్: పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించడమే తమ ధ్యేయమని సర్పంచి అలివేలమ్మ పేర్కొన్నారు. కొత్త చెరువు మండలం పరిధిలోని కోడపగానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయలో శుక్రవారం సర్పంచి అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచితో పాటు ఎంపీటీసీ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గంగంధర్, సహాయకులు కళ్యాయప్ప, సచివాలయం సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామసభలో చర్చించారు. ప్రణాళిక తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ రాధా అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మండల వ్యాప్తంగా 15 గ్రామపంచాయతీలో ఈ గ్రామసభలు నిర్వహించి అక్కడ నెలకొన్న సమస్యల పైన అర్జీలు గ్రామ ప్రజలనుండి స్వీకరించడం జరిగిందన్నారు. జాతీయ గ్రామీణ హామీ పథకం కింద గ్రామాల్లో మురికి నీటి కాలువలు వ్యవసాయానికి అనుసంధానమైన పనులు కల్పించడం జరుగుతుందన్నారు. గతంలో మండల వ్యాప్తంగా 15 పంచాయతీలలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ. 1. 25 కోట్లకు ప్రతిపాదనలు పంపగా రూ. 60 లక్షలు ప్రభుత్వం నుండి మంజూరైందనిత్వరలోనే ఈ పనులను ప్రారంభిస్తామని అన్నారు మేజర్ గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, వార్డ్ మెంబర్ రమేష్ బాబు, జడ్పిటిసి గంగాదేవి, టిడిపి నాయకులతో పాటు మండల స్పెషల్ ఆఫీసర్ శివ రంగ ప్రసాద్, ఎంపీడీవో బారాన్ సాహెబ్, ఏపీవో నాగిరెడ్డి, ఇన్‌ఛార్జి కార్యదర్శి సురేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో సమస్యపైనే చర్చ జరిగింది. స్థానిక సచివాలయంలో గ్రామ సభలో రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీపీ పర్వీన్ భాను, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్ల సుధాకర్, నిజాం, సర్పంచ్ గోవిందు, శంకర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు , చాంద్ బాషా తదితరులు పాన్నారు.

బుక్కపట్నం. : స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న వారు మాట్లాడుతూ గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఒకేసారి 13,326 గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి మునుపెన్నడూ జరిగిన విధంగా ఉపాధి హామీ పథకాన్ని మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ షాబుద్దీన్, సర్పంచి నాగలక్ష్మి రాజు, జనసేన సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్, కన్వీనర్ మల్లి రెడ్డి, మాజీ సర్పంచి సాకే యశోద, నాయకులు సామకోటి ఆదినారాయణ, గోపాలపురం గంగాధర్, వెంకటరాముడు తదితరులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నిరుపేదలకు జాతీయ గ్రామీణ పథకంలో ప్రతి జాబ్ కార్డు ఉన్న కుటుంబం 100 రోజులు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2024 - 25 పనులకు సంబంధించిన ప్రణాళికను గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్లు, తాగునీరు, వ్యవసాయ అనుసంధానం చెరువుల్లో పూడికతీత పనులు తదితర వాటిని ప్రణాళికను సిద్ధం చేసి వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్, ఏపీవో మంజునాథ్, సీనియర్ అసిస్టెంట్ ఎన్ అమీర్ భాష, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, సర్పంచులు శివప్ప నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్వర్ణ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దరమే గ్రామ సభల లక్ష్యమని అధికారులు తెలిపారు. శుక్రవారం తలుపుల మేజర్ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. సభలో సంబంధించిన అధికారులు పాల్గొని తమ శాఖల నివేదికను వినిపించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎంపీడీవో కిరణ్ మోహన్ రావుకు అందజేశారు.

నల్లచెరువు : ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ఈ గ్రామసభలు ఎంతో ఉపయోగపడతాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని పంతులచెరువులో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఏపీవో మంజుల, టెక్నికల్ అసిస్టెంట్లు, టిడిపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. **బత్తలపల్లి :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీడీవో సాయిమనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. బత్తలపల్లి సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో సాయిమనోహర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ గ్రామ సభలలో ఉపాధి సిబ్బంది, మండలస్థాయి అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు : సమస్యలు లేని స్వర్ణగ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సమస్యలను గ్రామ సభలో తెలియజేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎపిడి రమేష్ బాబు, సర్పంచి సరస్వతి, ఎంపీడీవో వెంకటరమణ నాయక్, తహశీల్దార్ శోభ సువర్ణమ్మ, ఏపీవో మరియమ్మ, పంచాయతి సెక్రటరీ కృష్ణమూర్తి రెడ్డి, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు శంకర్ నాయుడు, రాజారెడ్డి, తెలుగు యువత మండల కన్వీనర్ కావడి ప్రవీణ్ కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీ కేంద్రాలలో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా 539 పనులను ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ సంక్షేమ పథకాలతో గుర్తించినట్లు ఎంపీడీవో సరస్వతి తెలిపారు. కొడిగినహళ్లి సచివాలయ కేంద్రంలో తహశీల్దార్ హసీనా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామాలలో అభివద్ధి కార్యక్రమాలను గుర్తించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.

కదిరి అర్బన్ : మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించామని ఎంపీడీవో అంజినప్ప తెలిపారు. ఉపాధి హామీ పథకం పాటు స్వర్ణ గ్రామ పంచాయతీ లక్ష్య సాధనలో చేపట్టబోయే పనులను గ్రామసభల ద్వారా గుర్తించడం జరిగిందన్నారు.

హిందూపురం : హిందూపురం మండలంలోని14 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. కిరికెరలో జరిగిన సభకు ఎంపిడిఓ నరేంద్ర కుమార్, బాలపంల్లి పంచాయితీలో జరిగిన సభకు ఇఓఆర్‌డి నటరాజ్‌తో పాటు ఆయా పంచాయితీల్లో జరిగిన గ్రామ సభలకు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భాగ్యమ్మ, నూలకుంట సర్పంచు మంజూనాథ్‌తో పాటు ఆయా పంచాయతీల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామసభను అడ్డుకున్న గ్రామస్తులు

అగళి : మండలంలోని పి.బ్యాడిగెర పంచాయతీలో ఉపాధి హామీలో బోగస్ కార్డుల ద్వారా కోట్ల రూపాయల్లో గోల్‌మాల్ జరిగిందని అధికారులను గ్రామస్తులను నిలదీశారు. శుక్రవారం ఏర్పాటుచేసిన గ్రామసభను అడ్డుకున్నారు. 2019 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి కలిసి కొందరి జాబ్ కార్డులు తీసుకుని ఓ గ్రూపు ఏర్పాటు చేసి మస్టర్‌లో బోగస్ సంతకాలు పెట్టుకొని డబ్బులు తీసుకున్నారన్నారు. ఇలా దాదాపు 25 గ్రూపుల ద్వారా డిమాండ్ ఫారంలో సూచించి పాత పనులకే కొత్త పనులు చేశామని కొలతలు చూపించి బిల్లులు పెట్టి డబ్బులు డ్రా చేశారన్నారు. ఈ విషయం గుర్తించిన కూలీలు ఆధారాలతో అక్కడికి చేరుకుని అధికారులకు చూపించారు. వెంటనే టెక్నికల్ అసిస్టెంట్‌ను పిలిపించాలని గ్రామస్తులు, ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. స్పందించిన అధికారులు మంగళవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పడంతో వారు శాంతించారు. ఇంతలో ఎస్ఐ వీరేశ్ అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పారు.

ఎస్పీని కలిసిన జెడ్పీ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి. రత్ననుఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం జిల్లాఎస్పీ కార్యాలయంలో ఎస్పీనికలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిస్థితులపై చర్చించారు.

పోలీసుల సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతామని శ్రీ సత్య సాయి జిల్లా అదనపు ఎస్పీ ఎన్ విష్ణు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసుల సమస్యల పరిష్కారానికి అదనపు ఎస్పీ గ్రీవెన్స్ ఏర్పాటు చేయగా 11 మంది పోలీసు సిబ్బంది నుండీ పిటీషన్లు సమర్పించారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది బదిలీలు, సస్పెన్షన్ రీఒక్, సరెండర్ లీవ్ , ఇంక్రిమెంట్లు ఇతర సమస్యలపై పిటీషన్లు అందజేశారు. సిబ్బంది సమస్యలను ముఖాముఖిగా తెలుసుకున్న అదనపు ఎస్పీ సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపుతామని సిబ్బంది న్యాయపరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ మల్లికార్జున, మురళి, నాగరాజు, బాల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

గ్రామ సభల్లో సిపిఎం డిమాండ్

బుక్కపట్నంలో అధికారులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

చిలమత్తూరులో వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామ సభలను ప్రభుత్వము నిర్ణయించిన సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. ఉపాధి పనులు పూర్తయిన వెంటనే కూలీలకు వేతనాలు చెల్లించాలన్నారు. కూలీలకు మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి పనిదినాలను పెంచాలని, కనీస వేతనం రూ.600లుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బ్యాళ్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ఉపాధి పనిదినాలను పెంచాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం అధికారులు నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ప్రవేశపెట్టినప్పటి నుండి ఉపాధి కూలీలకి పని దినాలు వంద రోజులు మాత్రమే కల్పించారన్నారు. రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని అలాగే రోజూ వేతనం ఆరు వందల రూపాయలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులకు యంత్రాలు వాడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మారుతీ, సిఐటియు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజువారి వేతనం పెంచాలని సిపిఎం నాయకులు రమణ ,కుళ్లాయప్ప కోరారు. శుక్రవారం మండల పరిధిలోని సున్నంపల్లి సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పెషల్ ఆఫీసర్ సురేష్‌కు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కూలీలకు రెండువందల పనిదినాలు కల్పించి వేతనం రూ. 600లుగా నిర్ణయించాలన్నారు. కూలీలు కోరిన చోట పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమేష్, శివప్ప, వెంకట నారాయణ, రమణప్ప, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ప్రభుత్వం ఉపాధిహామి పథకం ద్వార చేపట్టే పనులలో యాంత్రిక శక్తి వినియోగం తగ్గించి కూలీలకు ఉపాధి కల్పించాలని వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని కోడూరు పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉపాది నిధులను అభివృద్ధి పనుల ఉపయోగానికి ఎంత ప్రాధాన్యతను ఇస్తున్నారో కూలీలకు ఉపాధిని కల్పించడానికి అంతే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు, ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

పెనుకొండ : ఉపాధి హామీ పనులను యంత్రాలతో కాకుండా కూలీలతో మాత్రమే చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ కోరారు. మండలంలోని పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. అడదాకులపల్లిలో జరిగిన గ్రామసభలో గంగాధర్ మాట్లాడుతూ మెటీరియల్ కాంపొనెంట్ నిధులు తగ్గించి కార్మికుల వ్యయం పెంచాలన్నారు. కూలీలకు పనిముట్లు అందించాలన్నారు. వీటిపై గ్రామ సభలో తీర్మానాలు చేయాలని నోడల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు నారాయణ, చిన్న అంజనప్ప, గ్రామ కార్మిక సంఘం కమిటీ నాయకులు ఎస్.గోవిందు, తులసిబాయి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

రొద్దం : కోగిర గ్రామసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను కూలీలతో మాత్రమే చేయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. జంగిల్ క్లియరెన్స్ పనులను కూలీలతో చేయించాలని ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు.

గోరంట్ల రూరల్ : మండలంలోని పాలసముద్రం గ్రామసభలో ఉపాధి కూలీలకు పనిముట్లు, భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ అమలు, పనుల గుర్తింపు, తీర్మా నాలు, తదితర అంశాలపై గ్రామసభలు నిర్వహించడాన్ని ఎపివ్యకాసం తరుపున స్వాగతిస్తున్నామని తెలిపారు. పలు డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు ఉన్నతాధికారు లతో చర్చించి ఆయా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, ఉపాధి కూలీలు ప్యారిమా, రామాంజనమ్మ , లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు

గ్రామసభలకు ప్రజలు కరువు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధి వివిధ గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలకు ప్రజాస్పందన కరువైంది. ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల గురించి దండోరా వేయించి ప్రజలకు తెలియజేయాల్సిన అధికారులు, పాలకులు ఆదిశగా చర్యలు చేపట్టకపోవటంతో పలు గ్రామసభల్లో అధికారులు తప్ప ప్రజలు కన్పించలేదు. ఇదిలా ఉండగా వెలిచలమ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన గ్రామ సభలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఒక గ్రామ పంచాయతీకి ముగ్గురిని ఫీల్డ్ అసిస్టెంట్ నియమించడమే ఇందుకు కారణమని తెలిసింది. మరికొమ్మదిన్నె, జోకుల గ్రామసభలకు సమయానికి అధికారులు హాజరుకాలేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శించారు.

ఎన్పీకుంట మండలంలోని గ్రామసభలో ప్రజలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

నేరాలు ఘోరాలు

దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - బత్తలపల్లి

వ్యవసాయ పరికరాలు, డ్రిప్పు పైపులు తదితర వాటిని చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి డ్రిప్పు పైపులను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.శుక్రవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసినవ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన నాదెండ్ల రంగస్వామి వ్యవసాయ పొలంలో మూడు రోజుల క్రితం డ్రిప్పు పైపులు చోరీకి గురయ్యాయన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ పర్యవేక్షణలో తమ సిబ్బంది వ్యవసాయ పరికరాలను చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కనగానపల్లి మండలం భానుకోట గ్రామానికి చెందిన వడ్డే భూపతిరాజు, బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లి గ్రామానికి చెందిన సిద్ద రామమోహనరెడ్డి, అనంతపురం టౌన్ వినాయక్ నగర్ కు చెందిన పల్ల జగదీశ్వర్‌ను శుక్రవారం అరెస్టు చేసి వారి నుండి ఆరు కట్టల డ్రిప్పు పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు నిందితులు తాగుడు, జల్సాలకు అలవాటుపడి చెడువాట్లను తీర్చుకోవడానికి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

సమ్మెలోకి సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదనే కారణంతో సమ్మెకు దిగారు. శుక్రవారం బత్తలపల్లిలోని వాటర్ ట్యాంకు వద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వని కారణంగా సమ్మెలో పాల్గొంటున్నట్లు వివరించారు. తమ సమస్యను పరిష్కరించేవరకు సమ్మెను విరమించేదిలేదన్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం స్పందించి కార్మికులకు ఇవ్వాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో ఐఎఫ్‌టియు జగన్, మారుతి, బాషా, మహబూబాబాషా, కేశవ, సద్గురు, రాము, సిద్ధయ్య, అనంతయ్య, జయరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అం తరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డిఇఇ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఈలు కొండారెడ్డి, నాగభూషణం, జానకీరామ్ తెలిపారు.ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం సబ్ స్టేషన్లో మరమ్మతుల కారణంగా లైన్ క్లియరెన్స్ తీసుకోవడం కోసం విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 11-30 గంటల నుండి మధ్యాహ్నం 1-30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ప్రధానంగా రాంనగర్, కొత్తపేట, గాంధీనగర్, మారుతీనగర్, సత్యసాయినగర్, టీచర్స్‌కాలనీ, రేగాటిపల్లిరోడ్, శాంతినగర్, శారదానగర్, గుట్టకిందపల్లి, చంద్రబాబునగర్, నేసేపేట ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అట్టహాసంగా గ్రామోత్సవం

ధర్మవరం టౌన్ : ధర్మవరం మండలం కుణుతూరు గ్రామంలో శుక్రవారం రాత్రి ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుణుతూరు గ్రామ పెద్దల సమక్షంలో ఆంజనేయస్వామి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామని గ్రామపెద్దలు తెలిపారు.